# తక్షణమే మూడు కేసుల పరిష్కారం



కక్షిదారులతో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి అనిత

నర్సాపూర్, సెప్టెంబర్ 30: పీఎల్‌సీ కేసుల్లో భాగంగా మూడు కేసులను జూనియర్ సివిల్ జడ్జి అనిత తక్షణమే పరిష్కరించారు. శనివారం మండల లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో నర్సాపూర్ కోర్టులో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశా రు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి అనిత మాట్లాడుతూ కేసుల విషయంలో రాజీ కుదుర్చుకుని తక్షణమే న్యాయం పొందవచ్చన్నారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ బెంచ్ ద్వారా ఇరువర్గాలు తగాదా పడి కోర్టును ఆశ్రయించగా, పలు విషయాలు పరిశీలించి, రూ.లక్షా యాభై వేల నగదు ఇప్పించి, పరిష్కరించినట్లు తెలిపారు. కారు లోన్ ద్వారా ఇబ్బంది పడుతున్న కేసుకు సంబంధించి వన్ టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా పీఎల్‌సీ పరిశీలించామన్నారు. వివిధ గ్రామాల ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది స్వరూపారాణి, న్యాయవాది రాజునాయక్, కోర్టు సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలి

## నాగ్సాన్‌పల్లి పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జీలు




న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న మెదక్ కోర్డు జడ్జిలు

పాపన్నపేట, సెప్టెంబర్ 30: తమపై జరిగే వేధింపులను బాలికలు ధైర్యంగా ఎదుర్కోవాలని, అవసరమైతే చైల్డ్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని మెదక్ కోర్ట్ జడ్జిలు శ్రీమతి రీటాలాల్ చంద్, శ్రీమతి కల్పన పేర్కొన్నారు. శనివారం పాపన్నపేట మండలంలోని నాగ్సాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చట్టాలపై, సైబర్ నేరాలపై, బాల్య వివాహంతో కలిగే అనర్థాలు, మొబైల్‌ను అతిగా వాడడంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాలికలపై వేధింపులు జరిగితే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, సైబర్ నేరాల విషయంలో 1930 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పాపన్నపేట సబ్ ఇన్‌స్పెక్టర్ మహిపాల్‌రెడ్డి, షీ టీమ్ బృందం, ప్రధానోపాధ్యాయుడు రాంకిషన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అశోక్ కుమార్, నర్సింలు, బాలరాజు, బాల నర్సయ్య, బాబర్, రేఖ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో తొలిసారిగా యూత్ పార్లమెంట్

## - ఓయూ వేదికగా అక్టోబర్ 8, 9, 10 తేదీల్లో నిర్వహణ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో తొలిసారిగా సిటిజన్ యూత్ పార్లమెంట్‌ను ఈనెల 8, 9, 10 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీ సౌజన్యంతో ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహిస్తామని సిటిజన్ ఇండియా సీఈవో స్వాతిచంద్రశేఖర్ తెలిపారు. మొత్తం మూడు అంశాలను ప్రధానంగా చర్చించనున్నారు. వాటిలో తెలంగాణ అంశాన్ని ప్రధానంగా ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు, వచ్చిన తర్వాత అభివృద్ధి ఎలా జరిగింది, వ్యవసాయం ఎలా బాగుపడింది, రైతుల కోసం అమలు పరుస్తున్న రైతుబంధు పథకం ఎలా అమలవుతుంది..? ఈ పథకం వల్ల రైతులకు కలుగుతున్న లాభాలు? వంటి అంశాలై ప్రత్యేకంగా చర్చించనున్నారు. రెండో అంశంగా యూనిఫాం సివిల్ కోడ్ అమలు, మూడో అంశంగా మహిళా బిల్లు గురించి చర్చించనున్నారు. యూత్ పార్లమెంట్‌లో రాష్ట్రంలోని ఓయూ, కాకతీయ, శాతవాహన, జేఎన్‌టీయూ వంటి పలు రకాల యూనివర్సిటీల నుంచి అనేక మంది విద్యార్థులు పాల్గొనున్నారు. ఈ యూత్ పార్లమెంట్‌లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న యువత/విద్యార్థులు ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అక్టోబర్ 4 వరకు గడువు విధించారు. రిజిస్ట్రేషన్ కోసం http://forms.gle/3rshpgfR5fe4ACUa9 పోర్టల్‌ను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. పూర్తి వివరాల కోసం 9319256888 ఫోన్ నంబర్‌కు సంప్రదించాల్సి ఉంది. 18 నుంచి 40 ఏండ్ల వయసున్న మహిళలు, పురుషులు పాల్గొనవచ్చు. యువతతో పాటు నిష్ణాతులు, ప్రొఫెసర్లు, రాజకీయనాయకులు పాల్గొంటారు.

# రూ.5.41 కోట్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

- మెదక్ జిల్లాలోని ఏడు ఎంఎల్ఎస్ పాయింట్లలో తనిఖీలు
- ముగ్గురు ఇన్‌చార్జిల సస్పెన్షన్

మెదక్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): కంచె చేను మేసిన చందంగా తయారైంది పౌర సరఫరాల శాఖ. అధికారుల నిఘా లేక పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఎంఎల్ఎస్ పాయింట్లు అక్రమాలకు అడ్డాగా మారాయి. మెదక్ జిలాల్లో 7 ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. ఇందులో మెదక్, తూప్రాన్, నర్సాపూర్, చేగుంట, రామాయంపేట, పాపన్నపేట, పెద్దశంకరంపేట ఉన్నాయి. రెండేండ్లుగా మెదక్, రామాయంపేట, చేగుంట ఎంఎల్ఎస్ పాయింట్లలో అక్రమాలు జరుగుతున్నా, అధికారులు పట్టించుకోలేదు. ఎంఎల్ఎస్ పాయింట్లలో ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న అధికారులు పీడీఎస్ బియ్యంతో పాటు సన్న బియ్యాన్ని పక్కదారి పట్టించారు. వారం రోజుల క్రితం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఎంఎల్ఎస్ పాయింట్లలో తనిఖీలు నిర్వహించగా ఈ భాగోతం బయటపడింది. మెదక్ జిల్లాలో ప్రతి నెలా కోట్లాది రూపాయల సబ్సిడీతో ప్రభుత్వం నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తున్నది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పీడీఎస్ బియ్యం దారి మళ్లుతున్నాయి. బియ్యాన్ని రేషన్ దుకాణాలకు చేర్చే బాధ్యత అధికారులదే. బియ్యం లోడ్ వాహనంలో రూట్ అధికారులు విధిగా ప్రయాణించి బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలి. అయితే రేషన్ షాపులకు పంపే పీడీఎస్ బియ్యం, సన్న బియ్యం సరఫరాలో ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలు కక్కుర్తి పడుతున్నారు. దీంతో కోట్ల విలువ చేసే పీడీఎస్ బియ్యం, సన్న బియ్యం పక్కదారి పడుతున్నాయి.

**కోట్ల విలువైన బియ్యం స్వాహా..**

మెదక్ జిల్లాలో ప్రతి నెలా 30 వేల క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సరఫరా అవుతున్నది. 2వేల క్వింటాళ్ల సన్న బియ్యం రేషన్ షాపులకు పంపిణీ చేస్తున్నారు. మెదక్ ఎంఎల్ఎస్ పాయింట్‌లో 3626 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 225 క్వింటాళ్ల సన్న బియ్యంతోపాటు 3,61 లక్షల కొత్త గన్నీ బస్తాలు పక్కదారి పట్టాయి. సుమారు రూ.4.50 కోట్ల విలువ గల బియ్యం స్వాహా అయినట్టు సంబంధిత శాఖ అధికారులు గుర్తించారు. మెదక్ ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి నర్సింలు ను సస్పెండ్ చేశారు. రామాయంపేట ఎంఎల్ఎస్ పాయింట్‌లో 1468 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 14 క్వింటాళ్ల సన్న బియ్యం హాస్టల్‌కు తరలించారు. రూ.56 లక్షల విలువ గల బియ్యం పక్కదారి పట్టాయి. ఇక్క డీఎంఎల్ఎస్ పాయింట్‌లో ఇన్‌చార్జిగా ఉన్న తూప్రాన్ డిప్యూటీ తహసీల్దార్ సతీశ్‌ను సస్పెండ్ చేశారు. చేగుంట ఎంఎల్ఎస్ పాయింట్‌లో 933 క్వింటాళ్ల పీడీఎస్ బియానికి సంబంధించిన లెక్కలు తప్పుగా ఉండడంతో ఆర్ఐ ప్రవీణ్‌ను సస్పెండ్ చేశారు. దీని విలువ రూ.35 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

### కోట్ల విలువైన బియ్యం పట్టుకున్నాం



జిల్లాలోని మెదక్, రామాయంపేట, చేగుంట ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలను సస్పెండ్ చేశాం. సుమారు రూ.5.41 కోట్ల విలువైన పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టింది. మెదక్ జిల్లాలో ఉన్న 7 ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేశాం. మా తనిఖీల్లో పీడీఎస్ బియ్యం భారీగా పక్కదారి పట్టిన విషయాన్ని కనిపెట్టాం. ఈ విషయాన్ని కమిషనర్‌కు రిపోర్టు పంపించాం.

– హరికృష్ణ,
పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్, మెదక్

# తడి, పొడి చెత్తను వేరుచేయాలి

## - మున్సిపల్ సర్వ సభ్య సమావేశంలో కౌన్సిలర్ల ప్రతిజ్ఞ



ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్, కౌన్సిల్ సభ్యులు

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 30: తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ అన్నారు. శనివారం మెదక్ మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఇటీవల మరణించిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఎలవర్తి మహాలక్ష్మికి సంతాపం తెలిపి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా 15 రోజుల నుంచి స్వచ్ఛత హీ సేవలో భాగంగా కౌన్సిల్ సమావేశంలో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ అందరం కలిసి తడి పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలన్నారు. ఆరుబయట, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎలాంటి చెత్త పారవేయకూడదన్నారు. స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ భారత్ గురించి అందరు తమ వంతు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ మాట్లాడుతూ పట్టణంలో శానిటేషన్, వాటర్ సప్లయ్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ మేడి కళ్యాణి మాట్లాడుతూ రోడ్లలో ఉన్న గుంతలకు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. శానిటేషన్ సిబ్బంది సక్రమంగా పనిచేసేలా సూచనలు జారీ చేయాలని కోరారు. కౌన్సిలర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు.

**సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం**

అనంతరం గత నెల 23న నూతన సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన సీఎం కేసీఆర్ పట్టణ అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేసినందుకు మున్సిపల్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నిధులు మంజూరు కావడానికి కృషి చేసిన మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, కమిషనర్, సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

## రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు రాగ జ్యోతి



సమావేశంలో పాల్గొన్న అధికారులు



మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు రాగ జ్యోతి

మెదక్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చడమే ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు రాగ జ్యోతి అన్నారు. శనివారం జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని కలెక్టరేట్ ఆడిటోరియం హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు రాగ జ్యోతి, బీబీఏ రాష్ట్ర కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ రమేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అబ్బాయికి 21 ఏండ్లు, అమ్మాయికి 18 ఏండ్లు పూర్తి కాకుండా వివాహాలు చేయవద్దన్నారు. బాల్య వివాహం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాల నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. బాల్య వివాహాల నిర్మూలనకు గ్రామ స్థాయిలో వీసీపీసీలు, మండల స్థాయిలో ఎంసీపీసీలు, సర్పంచ్, ఎంపీపీల అధ్యక్షతన అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా విద్యాధికారి రాధాకిషన్, జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ, సీడీపీవోలు హేమభార్గవి, స్వరూప, ఈవో పద్మలత, డీసీపీయూ సిబ్బంది, సీహెచ్ఎల్ సిబ్బంది, ఎంపీడీవోలు, సఖి కేంద్రం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.